# డ్రోన్ విప్లవం దిశగా ఏపీ ముందడుగు

- **కొత్త మార్గదర్శిని అమలు చేయాలని నిర్ణయం**
- **దేశంలోనే ఇది మొదటిసారి**

**దావోస్:** డ్రోన్ విప్లవం దిశగా ఆంధ్రప్రదేశ్ కీలక ముందడుగు వేసింది. కొత్తగా ఆవిష్కరించిన 'అడ్వాన్స్డ్ డ్రోన్ ఆపరేటర్స్ టూల్‌కిట్'ను అమలు చేయడానికి నిర్ణయించింది. తద్వారా భారత్‌లో దీన్ని చేపట్టబోతున్న మొట్టమొదటి రాష్ట్రంగా అవతరించింది. మందులు వంటి కీలక సరఫరాలను రవాణా చేయడానికి డ్రోన్లను ఉపయోగించాలనుకుంటున్న ప్రభుత్వాలకు ఇది ఓపెన్ సోర్స్ మార్గదర్శిగా పనికొస్తుంది.

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో ఈ ఓపెన్ సోర్స్ గైడ్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రోన్ల ద్వారా రవాణా కార్యకలాపాలను వీలుకల్పించేలా ఈ టూల్‌కిట్‌లో అభివృద్ధి చేసిన విధానపరమైన ముసాయిదాలను పరీక్షించడం మొదలుపెడతామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, గ్రామీణాభివృద్ధి మంత్రి నారా లోకేశ్ దావోస్ సదస్సులో వెల్లడించారు. దీన్ని అమలు చేసే మొట్టమొదటి ప్రభుత్వ భాగస్వామిగా ఆంధ్రప్రదేశ్ నిలవడం గర్వకారణమన్నారు. ఇందులోని అంశాలను ఉపయోగించుకొని రాష్ట్రంలో ప్రజలకు కీలకమైన వైద్య సంబంధిత సరఫరాలను చేరవేసే ఒక డ్రోన్ రవాణా కార్యక్రమాన్ని అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. స్విట్జర్లాండ్, రువాండా ప్రభుత్వాలతో విస్తృత భాగస్వామ్యం ద్వారా ఈ టూల్‌కిట్‌ను అభివృద్ధి చేశారు. డ్రోన్ ఇన్నోవేటర్స్ నెట్‌వర్క్ (డీఐఎన్) చేసిన కసరత్తును ఉపయోగించుకున్నారు. సమాజానికి ఉపయోగపడే అధునాతన డ్రోన్ కార్యకలాపాలను ప్రారంభించాలనుకుంటున్న ప్రభుత్వాలకు ఉపయోగపడే మార్గసూచీ. డ్రోన్ కార్యకలాపాల్లో నేర్చుకున్న పాఠాల ఆధారంగా దీన్ని రూపొందించారు. డ్రోన్‌లకు సంబంధించిన మార్గదర్శకాలను అమలు చేయడంలో ఉన్న అవరోధాలను అధిగమించి, భద్రంగా వాయు మాధ్యమ వినియోగానికి ఊతమిచ్చే చర్యలను పాటించేందుకు ఇది దోహదపడుతుంది. ప్రభుత్వాల పరిశీలన కోసం నిర్దిష్ట సూచనలను కూడా ఇందులో చేశారు. డ్రోన్ ద్వారా బట్వాడా సేవలను అందిస్తున్న సంస్థల్లో తాము ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉన్నామని జిప్‌లైన్ సంస్థ సహ వ్యవస్థాపకుడు విల్ హెట్జలర్ చెప్పారు. తాజా టూల్‌కిట్‌లో తాము కూడా తమ అనుభవాన్ని జోడించామని తెలిపారు.